క్లుప్తంగా

శరవేగంగా పంట నష్టం ఆన్‌లైన్ నమోదు

తుని రూరల్: మండలంలో ఇటీవల మిచాంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంట నష్టం నమోదు కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసిన వ్యవసాయ అధికారులు, రైతుల నుంచి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతులకు సకాలంలో పంట నష్టపరిహారం అందేందుకు అనువుగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్టు ఏఓ బి.అశోక్ కుమార్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. ఇది రెండు రోజుల్లో పూర్తవుతుందని, ఉన్నతాధికారుల ఆదేశాలతో బాధితుల జాబితాను సామాజిక తనిఖీ కోసం త్వరలో ఆర్‌బీకేల్లో ఉంచుతామన్నారు. ఎక్కడైనా పంట నష్టం నమోదు కాకపోతే ఆయా గ్రామాల్లో ఉన్న వీఏఏ, వీహెచ్‌ఏలను సంప్రదించాలన్నారు.

హిందీ ప్రచార మండలి కార్యవర్గం

జగ్గంపేట: హిందీ ప్రచార మండలి కార్యవర్గ సమావేశం స్థానిక విశ్రాంతి ఉద్యోగుల భవనంలో మంగళవారం జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గానికి గౌరవాధ్యక్షుడుగా ఎస్వీ గంగిరెడ్డి, అధ్యక్షుడిగా పి.జయలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా మహబూబ్ అలీ, ప్రధాన కార్యదర్శిగా గుండోజు విశ్వనాథం, సహాయ కార్యదర్శిగా డీఎస్ఎస్ శాస్త్రి, కోశాధికారిగా జీవీఎస్ నూకరాజు, కార్యవర్గ సభ్యులుగా టి.దుర్గాదేవి తదితరులు నియమితులయ్యారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రత్తిపాడు: ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని బీసీ కార్పొరేషన్ ఈడీ, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఓటరు జాబితాలో ఒకటి కంటే ఎక్కువ సార్లు నమోదైన, వేర్వేరు చోట్ల ఒకే ఫొటో ఉన్నా సరిచేయాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులపై విచారణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డీటీ టి.శ్రీనివాసరావు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం డిప్యూటీ తహసీల్దార్లు కె.పుణ్యవతి, ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వివిధ పార్టీల నాయకులు ధరణాలకోట శ్రీను, కొండపల్లి శ్రీనివాసు, మదినే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి

కోటనందూరు: గ్రామ స్థాయిలో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పోటీలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. క్రీడల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ క్రీడల నిర్వహణ, గ్రౌండ్ల సన్నద్ధతపై అవగాహన కల్పించారు. క్రీడల నిర్వహణలో విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏవీ రమణ, రాజా నాగేశ్వరరావు, కుశిరెడ్డి అప్పలరాజు, ఎస్ శ్రీనివాస్, భవాని తదితరులు పాల్గొన్నారు.

చలో నెల్లూరు గోడపత్రిక ఆవిష్కరణ

తుని: నెల్లూరులో ఈ నెల 19న జరిగే జైహో రెండో జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి రమణ, జైహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మున్సిపల్ పార్కులో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద చలో నెల్లూరు కార్యక్రమ గోడపత్రికను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జాతీయోద్యమ స్ఫూర్తితో జాతిని ఏకం చేసేందుకు, మతోన్మాదుల్ని నిర్మూలించేందుకు జాతీయ స్థాయిలో నిర్మాణమవుతున్న ఈ మహోద్యమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫక్కుర్తి గోవిందరావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ ఖ్వాజా, పోకాల సత్యనారాయణ, ఎంకేఎస్ అహ్మద్, యాసరపు అర్జున్, గారా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

తుని రూరల్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రయోజనాలను వివరించేందుకు ఈ నెల 15 నుంచి 26 వరకు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఎంపీడీఓ సంకల్ప యాత్ర వివరాలను వెల్లడించారు. ఇందుకు నోడల్ అధికారులను నియమించామన్నారు. ఈ నెల 15న ఎస్ఎస్‌వీ నగరం, ఎస్.అన్నవరం, 16న వి.కొత్తూరు, కొలిమేరు, 17న హెచ్.కొత్తూరు, అటికెవానిపాలెం, 18న రాపాక, చామవరం, 19న డి.పోలవరం, టి.తిమ్మాపురం, 20న హంసవరం, కేఓ మల్లవరం, 21న కుమ్మరిలోవ, లోవకొత్తూరు, 22న రేఖవానిపాలెం, ఎ.అగ్రహారం, 23న తాళ్లూరు, వల్లూరు, 24న రాజుపేట, ఎస్.సూరవరం, 25న తేటగుంట, దొండవాక, 26న చేపూరు గ్రామాల్లో సంకల్ప యాత్ర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వ అధికారులు హాజరవుతారని చెప్పారు.

దవాఖానాకు మహర్దశ

- రూ.8.50 కోట్లతో 50 పడకల ఆస్పత్రిగా ప్రత్తిపాడు సీహెచ్‌సీ అభివృద్ధి
- అందుబాటులోకి రానున్న మెరుగైన వైద్యం



నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం

ప్రత్తిపాడు: సౌకర్యాల లేమి, మందుల కొరత, అంతకుమించి అందుబాటులో ఉంటారో.. ఉండరో తెలియని వైద్యులు. వెరసి ఆస్పత్రులకు వెళ్లాలంటేనే జనం హడలిపోయే పరిస్థితి ఒకప్పటిది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేశారు. దాంతో ఆస్పత్రుల రూపురేఖలే మారిపోయాయి. ఇందుకు నిదర్శనం ప్రత్తిపాడు సీహెచ్‌సీ.

ఒకప్పుడు అరకొరగా మందులు, ఒకరు లేక ఇద్దరు వైద్యులతోనే ప్రత్తిపాడు సీహెచ్‌సీ ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించడంతో.. పదేళ్ల క్రితం వరకు పది పడకల ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని అప్‌గ్రేడ్ చేసి, 30 పడకల స్థాయికి పెంచారు. అందుకు తగ్గట్టుగా పోస్టులను పెంచడం, భర్తీ చేయడం జరగలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ సీహెచ్‌సీ అభివృద్ధి బాట పట్టింది. కోవిడ్ సమయంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్ చొరవతో కోవిడ్ వార్డును ఏర్పాటు చేసి, ఎందరికో వైద్యం అందించి, సురక్షితంగా ఇళ్లకు పంపారు. అనేకసార్లు వివిధ విభాగాల్లో అందించిన సేవలకు రాష్ట్ర, జిల్లా స్థాయిలోనే బెస్ట్ సీహెచ్‌సీ అవార్డులు లభించాయి.

లక్ష్యాన్ని మించి సేవలు

ఈ సీహెచ్‌సీలో అన్ని విభాగాల్లో ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకూ లక్ష్యానికి మించి వైద్య సేవలు అందించింది. ఓపీ 96 వేలు లక్ష్యం కాగా, 1,13,218, ఇన్ పేషెంట్లు 10,800కు 11,059, ఎక్స్‌రేలు 3,600కు 6,006, డెలివరీలు 1,200కు 1,001, వివిధ రకాల రక్త పరీక్షలు 12 వేలకు 1,32,943 పరీక్షలు నిర్వహించారు, మొత్తం 1,23,600 లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 2,64,227 పరీక్షలతో లక్ష్యాన్ని అధిగమించింది. ప్రతి నెలవారీ సేవల్లో ఎ–గ్రేడ్‌లో నిలిచింది.

చురుగ్గా సాగుతున్న భవన నిర్మాణం

ప్రత్తిపాడు సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ భవన నిర్మాణానికి నాబార్డు రూ.8.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. వచ్చే ఏడాది నిర్మాణం పూర్తికానున్నట్టు సమాచారం. భవన నిర్మాణం, పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మహర్దశ పట్టుకుంది. సీహెచ్‌సీకి కావాల్సిన జనరేటర్ సహా ఇప్పటికే వసతులు సమకూరాయి. గత ఏడాదిలో ఈ 30 పడకల సీహెచ్‌సీని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనతో పాటు సిబ్బంది నియామకం జరిగింది. ఎనిమిది మంది వైద్యులు, ఒక హెడ్ నర్సు, 11 మంది స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్‌తో పాటు సుమారు 40 మంది సిబ్బందితో వైద్య సేవలందిస్తోంది. అత్యవసర, ఓపీ వైద్య సేవలు అత్యంత చేరువకావడంతో సీహెచ్‌సీ పరిధిలోని వైద్య సేవలు పొందుతున్న ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, శంఖవరం, గొల్లప్రోలు మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్

సీహెచ్‌సీకి అన్ని హంగులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల వైద్యానికి ప్రాధాన్యమిచ్చింది. ఎమ్మెల్యే పర్వత చొరవతో ఐదు మండలాల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సీహెచ్‌సీని 50 పడకల స్థాయికి పెంచి, అన్ని హంగుల కల్పనకు శ్రీకారం చుట్టింది.

– ఏడిద రెడ్డినాయుడు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు, ప్రత్తిపాడు

పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు



జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, దంత వైద్యుడు, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాల్సిందిగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అన్ని వేళలా సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. అన్ని వసతులతో నూతన భవనం వినియోగంలోకి వస్తే వసతి కొరత తీరుతుంది.

– ఎం కన్యాకుమారి, ఆర్ఎంఓ, సీహెచ్‌సీ, ప్రత్తిపాడు

ఆరోగ్యమిత్రకు ఉత్తమ సేవా పురస్కారం



కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కాశీవిశ్వనాథ్

గోకవరం: గోకవరం ప్రభుత్వాస్పత్రి ఆరోగ్యమిత్ర దాసరి కాశీవిశ్వనాథ్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఆగస్టులో ఆయన అందించిన సేవలకు మంగళవారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా ఆయనకు ఈ అవార్డు, నగదు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథ్‌ను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, వైద్య సిబ్బంది అభినందించారు.

డిగ్రీ కళాశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు

తుని రూరల్: వి.కొత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తుని పుష్ప కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత ప్రారంభించారు. సుమారు 300 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన విద్యార్థులకు సూచనలు చేశారు. వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చేసే నాయకుడే కావాలి



యర్రంపాలెంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



వెంకటనగరంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



ఏలేశ్వరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- యర్రంపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

గండేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో అట్టడుగు వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడిన నాయకుడే కావాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. యర్రంపాలెంలో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం అమలుచేసిన పథకాలను ప్రజలకు అందజేస్తూ, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హామీలు మాటలకే పరిమితమయ్యాయన్నారు. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రి కావాలో, ఆశచూపే ముఖ్యమంత్రి కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఎక్కడ, ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ లబ్ధిదారుల చెంతకే పింఛను అందుతుందన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని, పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, జేసీఎస్ గ్రామ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి జగన్ కృషి

జగ్గంపేట: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి నిరంతర కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రాబోయే ఎన్నికల్లో అండగా ఉండాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మన్యవారిపాలెం గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి అందిన పథకాలు, లబ్ధిదారుల వివరాల డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరి నాని, సర్పంచ్ పోట్రు వీర్రాజు, ఎంపీటీసీ నక్కా నరసింహులు, పార్టీ నేత కేశినీడి శ్రీను, ఎంపీడీఓ వసంతకుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రతి ఇంటికి సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, మండల కన్వీనర్ పంచాది వీరబాబు అన్నారు. వెంకటనగరంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సచివాలయంలో పథకాల బోర్డును, గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచ్‌లు నడిగట్ల త్రిమూర్తులు, గొనగాల అప్పలరాజు, రొంగల నాగేశ్వరరావు, ఎంపీటీసీలు మేడపాని సింహాద్రి, అమరాది కాశి, స్థానిక నాయకులు గొరగపూడి బాపన్నదొర, అనిశెట్టి అర్జున్, కోరాపు చిట్టియ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలవ్వాలంటే..

అన్నవరం: నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు దేశంలో మరో ముఖ్యమంత్రి అమలు చేయలేదని అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ శంఖవరం మండల కన్వీనర్ నరాల శ్రీనివాస్, మండల వైస్ ఎంపీపీ దారా వేంకటరమణ, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, నాయకులు కొండపల్లి అప్పారావు, ఈఓపీఆర్డీ రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మళ్లీ జగన్ రావాలి

తొండంగి: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మంగళవారం శృంగవృక్షంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో పాటు పేద, మధ్యతరగతి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. అనంతరం పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, నాయకులు కొయ్యా మురళి, అంగుళూరి సుశీలరాణి, దడాల విజయ్, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, ఎలిశెట్టి గిరి, సర్పంచ్ దార అప్పన్న, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం జగనే సీఎం కావాలి

ఏలేశ్వరం: రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని వైఎస్సార్ సీపీ నేత, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఏడో వార్డులో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

సాగు చేసుకుంటున్న వారికే పట్టాలు

- ఆర్డీఓ సీతారామారావు హామీ
- రైతు కూలీల దీక్ష విరమణ



జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు కూలీ నేతలతో చర్చిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

జగ్గంపేట: గుర్రంపాలెంలో సీలింగ్ భూమిని సాగుచేసుకుంటున్న వారిని కచ్చితంగా గుర్తించి, వారికే పట్టాలు అందించే కార్యక్రమం చేస్తామని, ఇప్పటి వరకూ ఈ భూమిలో ఎవరికీ పట్టాలివ్వలేదని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద 16 రోజులుగా ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సీలింగ్ భూమిలో పట్టాలు ఇవ్వాలని కోరుతూ నిరాహార దీక్షలు చేస్తున్నారు. మంగళవారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు నిరాహార దీక్షా శిబిరానికి వచ్చారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులుతో ఆయన మాట్లాడారు. ఆర్డీఓ మాట్లాడుతూ 20 ఏళ్లగా సీలింగ్ భూమిని సాగు చేసుకుంటున్న వారికే పట్టాలు అందజేస్తామని చెప్పారు. అర్హత లేని వారికి పట్టాలు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అపోహలకు గురికావద్దని, త్వరలోనే పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. ఆర్డీఓ హామీ మేరకు దీక్షలు విరమిస్తున్నట్టు వీరాంజనేయులు చెప్పారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

తుని: ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డీవీ రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం సంస్థ సభ్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఈపీఎస్ 95, సీపీఎస్‌పై ఆప్షన్ నిలుపుదల చేసి, ఉద్యోగి ఎప్పుడైనా ఆప్షన్ ఇచ్చుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. కార్మికులకు పరిమితి లేని వైద్యాన్ని కొనసాగించాలని, ఉద్యోగుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. పనిష్మంట్ల విషయంలో అధికారుల నిర్ణయాలు పారదర్శకంగా ఉండేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్యారేజీలో ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుని డిపో సంఘ ప్రతినిధులు ఎంవీఆర్ మూర్తి, సాయిరాం, ఏపీ దాసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గ్రామీణ పోస్టల్ సిబ్బంది సమ్మె

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ గ్రామీణ పోస్టల్ సిబ్బంది మంగళవారం నుంచి సమ్మె చేపట్టారు. ఆలిండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్ పిలుపుమేరకు మండలవ్యాప్తంగా సిబ్బంది సమ్మె ప్రారంభించారు. స్థానిక సబ్‌పోస్ట్ ఆఫీసు వద్ద నిరసన తెలిపారు. సివిల్ సర్వెంట్ హోదా కల్పించి, రోజుకు 8 గంటల పనిదినం కల్పించాలని వారు కోరారు. 12, 24, 36 అదనపు సర్వీసు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి, గ్రూపు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలని తదితర డిమాండ్లు ముందుంచారు.

తెరవని అంగన్‌వాడీ కేంద్రాలు

రౌతులపూడి: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించి, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే అంగన్‌వాడీ కేంద్రాలు మంగళవారం మండల వ్యాప్తంగా తెరవలేదు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు కేంద్రాలను తెరవకుండా, సమ్మెలో పాల్గొన్నామని మండల అంగన్‌వాడీ సంఘ నాయకులు తెలిపారు.

శంఖవరం: సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె చేపట్టారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రౌతులపూడి, శంఖవరం మండలాల సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు.

జగ్గంపేట: తమ డిమాండ్ల సాధనకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో అంగన్‌వాడీ వర్కర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. జగ్గంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తుని: తహసీల్దార్ కార్యాలయం జీఎన్‌టీ రోడ్డు వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సంఘ నాయకులు ధనలక్ష్మి, ఆర్.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ప్రత్తిపాడు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర పంచాయతన ఆలయం వద్దనున్న అభయ దుర్గాదేవి ఆలయం వద్ద మంగళవారం భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అనంతరం అన్న సమారాధనలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యా శ్రీనుబాబు, ఎంపీటీసీ పిర్ల నాగేశ్వరరావు, విశ్రాంత ఏఎస్పై ఎం రాజారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, ధరణాలకోట తాతబ్బాయి, కట్టమూరి కొండబాబు పాల్గొన్నారు.

ధన సత్తెమ్మతల్లికి ప్రత్యేక పూజలు

జగ్గంపేట: భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతున్న ధన సత్తెమ్మతల్లి అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శెట్టిబలిజపేట సమీపంలోని పొలాల్లో ఉన్న ఈ అమ్మవారికి రెండేళ్లుగా బోనాల పండగ నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వైబోగుల కొండబాబు తెలిపారు. ప్రతి మంగళవారం భక్తుల సహకారంతో అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

తుపాను బాధిత కుటుంబాలకు మంత్రి దాడిశెట్టి సాయం



బెండపూడిలో తుపాను బాధితులకు సాయాన్ని అందజేసిన నాగం గంగబాబు, ఇతర నాయకులు

తొండంగి: మిచాంగ్ తుపాను ప్రభావంతో బెండపూడి తారకరామకాలనీలో ముంపు బారినపడిన వారికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సాయం అందించారు. బాధిత 63 కుటుంబాలకు బియ్యం, రూ.వెయ్యి చొప్పున మంగళవారం పంపిణీ చేశారు. మంత్రి ఈ నెల ఐదున ఏ.కొత్తపల్లి, బెండపూడి గ్రామాల్లోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులు తమ ఇబ్బందులను మంత్రి రాజా దృష్టికి తీసుకురాగా, ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఏ.కొత్తపల్లిలో బాధితులకు ఇప్పటికే రూ.లక్ష నగదు అందజేశారు. కాగా బెండపూడిలో 63 కుటుంబాలకు వ్యక్తిగతంగా రూ.వెయ్యి నగదు, 25 కిలోల బియ్యం వంతున పంపించారు. ఈ సాయాన్ని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణచౌదరి(పెద్దబ్బు), మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి తదితరులు బాధితుల ఇళ్లకు వెళ్లి అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొంతెన నాగేశ్వరరావు, ఏలేటి ధర్మరాజు, బూసాల గణపతి, వలంటీర్లు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి కార్తిక అమావాస్య పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఉదయం తొమ్మిది గంటలకు పండితులు ప్రత్యేక పూజలు చేశాక పత్యంగిర హోమం ప్రారంభించారు. హోమం అనంతరం 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి, ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి వేద పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, అర్చకులు ప్రయాగ రాంబాబు, కోట వంశీ, వ్రత పురోహితులు కూచుమంచి ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్ తదితరులు హోమం నిర్వహించారు. మొత్తం 40 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా కుంభాభిషేక మహోత్సవం



కలశాలతో ఊరేగుతున్న భక్తులు

శంఖవరం: పవిత్ర కార్తికమాసం కావడంతో భక్తులు విశ్వేశ్వరస్వామికి మహాకుంభాభిషేకం చేయడంతో గ్రామమంతా శివ నామస్మరణతో మార్మోగింది. కత్తిపూడి గ్రామంలో ఉన్న విశాలక్ష్మి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం మహాకుంభాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త మంచాల సత్యనారాయణ, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యకుమార్ శర్మ పూజలు నిర్వహించారు. విశ్వేశ్వరస్వామికి అభిషేకం చేసేందుకు 651 మంది ముత్తైదువలతో 651 కలశాలతో పరమ పవిత్ర సప్తనదీ జలాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు, అభిషేకాలు, పూజలతో పాటు బాజా భజంత్రీలు, బాణసంచా, భక్తిపాటలతో భక్తులు పరవశించారు. ముందుగా మహా గణపతి పూజ, రక్షా బంధన్ పూజలు చేసి, అనంతరం సప్త నదీజలాలతో 21 మంది వేద పండితులు కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి గోపురంపై ఆ జలాలతో అభిషేకం చేశారు.

రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుంది



కిర్లంపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తోట రవి

ప్రత్తిపాడు: తుపాను బాధిత రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి అన్నారు. పంట నష్టం వాటిల్లిన రైతులకు త్వరలోనే నష్ట పరిహారం అందుతుందని భరోసా ఇచ్చారు. కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి తోట రవి మాట్లాడుతూ తుపాను నష్టాలను అంచనా వేయడంలో రాజకీయాలకతీతంగా వ్యవహరించాలన్నారు. పంట నష్టం వాటిల్లిన రైతుల జాబితా రూపొందించి, సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. వాతావరణం అనుకూలంగా మారినందున రైతులతో ధాన్యాన్ని ఒబ్బిడి చేయించాలన్నారు. తడిసి, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చారని, రైతులకు ధైర్యం చెప్పాలని వీఆర్వో, వ్యవసాయ సహాయకులను కోరారు. తుపాను సమయంలో వ్యవసాయ సహాయకుల సేవలు భేషుగ్గా ఉన్నాయంటూ ఎంపీపీ అభినందించారు. ఎంఏఓ జోకా అమృత మాట్లాడుతూ గతంలో హెక్టారుకు ఉన్న పంట నష్టం రూ.15 వేలను ప్రభుత్వం రూ.17 వేలకు పెంచిందని చెప్పారు. రంగు మారిన ధాన్యాన్ని దగ్గర్లో ఉన్న మిల్లర్లకు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. సింహాద్రిపురం చెరువు కింద ఇప్పటికీ 50 ఎకరాల పంట నీటిలోనే ఉందని, నీరు పోయే మార్గం లేక చెరువుగా మారిందని మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు సభ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కేవీ మాధవరావు, ఈఓఆర్డీ మార్కండేశ్వరరావు, సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందుతుంది

ఏలేశ్వరం: తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేస్తుందని ఏఓ బి.జ్యోతి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, పంచాయతీ, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో తుపాను నష్టపరిహారంపై సమావేశం నిర్వహించారు. పంట నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ.17 వేలు చెల్లిస్తారన్నారు. ఆర్బీకేల ద్వారా నష్టపోయిన రైతుల జాబితాను రూపొందిస్తున్నట్టు చెప్పారు. జాబితాలను ఈ నెల 18 నుంచి 22 వరకు సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి మాట్లాడుతూ అరటి తోటలకు హెక్టార్‌కు రూ.25 వేలు చెల్లిస్తారని తెలిపారు. తహసీల్దార్ చిన్నారావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.